సాక్షి జగిత్యాల

సోమవారం । 26 । జూన్ । 2023



పోచమ్మ బోనాలు

జగిత్యాలటౌన్: విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఆషాఢమాసం సందర్భంగా పోచమ్మ బోనాల పండుగ వైభవంగా నిర్వహించారు.



అమ్మవారికి మొక్కులు

కోరుట్లరూరల్ : చిన్నమెట్‌పల్లి, సంగెం, యెఖీన్‌పూర్‌లో ఆదివారం పోచమ్మ తల్లికి బోనాలతో నైవేద్యం సమర్పించారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
31.0/25.0

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలోని పలుచోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

డ్రగ్స్ నిర్మూలనకు పటిష్ట చర్యలు



ఎస్పీ భాస్కర్

జగిత్యాలక్రైం: జిల్లాలో డ్రగ్స్, గంజాయి నివారణకు పోలీస్ శాఖ పటిష్ట చర్యలు తీసుకుంటోందని ఎస్పీ భాస్కర్ అన్నారు. ఆదివారం ప్రపంచ మాదకద్రవ్యాల నివారణ దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. యువత డ్రగ్స్‌కు బానిస కావొద్దని, బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని సూచించారు. డ్రగ్స్ వాడకం సంతోషంతో మొదలై దుఃఖంతో అంతమవుతుందని హెచ్చరించారు. తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనపై అనునిత్యం దృష్టి సారించాలని సూచించారు. వారి ప్రవర్తనలో మార్పులను ఎప్పటికప్పుడు గమనిస్తూ, సరైన మార్గనిర్దేశనం చేయాలని కోరారు. 2022లో జిల్లాలో 11 గంజాయి కేసులు నమోదయ్యాయని, 32మందిని అరెస్టు చేయడంతోపాటు వారి వద్ద 17.620 కిలోల గంజాయి, 11 గంజాయి మొక్కలు స్వాధీనం చేసుకుని సీజ్ చేశామన్నారు. 2023 జనవరి నుంచి ఇప్పటివరకు 5 గంజాయి కేసులు నమోదు చేసి, 13మందిని అరెస్టు చేశామని, వారి నుంచి 71.238కిలోల గంజాయి స్వాధీనం చేసుకుని సీజ్ చేశామని ఎస్పీ వివరించారు.

ఉద్యోగావకాశాలు

జగిత్యాలటౌన్: జిల్లాలోని మహాత్మా జ్యోతి బాపూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో అతిథి ఉపాధ్యాయులు, అధ్యాపక ఉద్యోగాల నియామకం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆర్సీవో గౌతంకుమార్‌రెడ్డి, డీసీవో వెంకటరమణ ఆదివారం తెలిపారు. అభ్యర్థులు ఆంగ్ల మాధ్యమంలో విద్యాబోధన చేయాలని సూచించారు. తెలుగు, హిందీ, ఇంగ్లిష్, మ్యాథ్స్, ఫిజికల్‌సైన్స్, బయోసైన్స్, సోషల్, సివిక్స్, ఎకనమిక్స్, కామర్స్ సబ్జెక్టుల్లో పోస్టులు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు తమ విద్యార్హతల సర్టిఫికెట్లతో అల్లీపూర్‌లోని మహాత్మాజ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో ఈనెల 26 నుంచి 28వ తేదీ వరకు సంప్రదించాలని సూచించారు. మరిన్ని వివరాలకు 79934 56643 మొబైల్ నంబరులో సంప్రదించాల్సిందిగా వారు కోరారు.

చెక్‌పోస్టు ఏర్పాటు



చెక్‌పోస్టు వద్ద ఎస్సై, పశువైద్యాధికారి

కథలాపూర్(వేములవాడ): కోరుట్ల– వేములవాడ డబుల్ రోడ్డుపై మండల కేంద్రంలో పశుసంవర్ధక, పోలీస్ శాఖ సంయుక్తంగా ఆదివారం చెక్‌పోస్టు ఏర్పాటు చేశాయి. వాహనాల్లో అక్రమంగా ఆవులను తరలించకుండా తనిఖీలు చేస్తున్నారు. ఐదురోజులపాటు చెక్‌పోస్టు కొనసాగుతుందని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సై కిరణ్‌కుమార్, పశువైద్యాధికారి శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

ఇవి 'భగీరథ నీళ్లే'నా?



కలుషితమైన ఈ నీరు తాగేదెలా?

మెట్‌పల్లి(కోరుట్ల): మిషన్ భగీరథ పథకం ద్వారా ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించాలి. కానీ, అధికారుల నిర్లక్ష్యంతో పట్టణంలోని వివిధ కాలనీలకు కలుషితనీరు సరఫరా అవుతోంది. రోజూ ఎక్కడో ఓచోట పైపులైన్లకు లీకేజీలు ఏర్పడుతుండడంతో కుళాయిల ద్వారా కలుషితమైన నీరు వస్తోందని కాలనీవాసులు ఆవేదన చెందుతున్నారు. ఆదివారం స్థానిక 12వార్డులో రంగుమారిన కలుషితనీరు సరఫరా కావడంతో స్థానికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. అసలే వర్షాకాలమని.. అందులోనూ సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని భయపడుతున్నారు. తాగునీటి సరఫరా విషయంలో అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

గోరింటాకు వేడుకలు



గోరింటాకు వేడుకల్లో మహిళలు

కథలాపూర్(వేములవాడ): గంభీర్‌పూర్‌లో ఆదివారం మహిళలు గోరింటాకు వేడుకలు నిర్వహించారు. ఆషాడం మాసంలో గోరింటాకు పెట్టుకుంటే అందంతోపాటు వ్యాధి నిరోధక శక్తి పెరిగి వ్యాధులు దరిచేరవని వారన్నారు.

రాయికల్(జగిత్యాల): వాసవీమాత ఆలయంలో కిట్టిపార్టీ ఆధ్వర్యంలో గోరింటాకు ఉత్సవం నిర్వహించారు. చేతులకు గోరింటాకు పెట్టుకుని సంబురాలు జరుపుకున్నారు.

నాసిరకం కూర.. పురుగుల అన్నం



కొండగట్టు(చొప్పదండి): కొడిమ్యాల మండలం నాచుపెల్లి జేఎన్టీయూ విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందడం లేదు. ఈవిషయాన్ని చాలాసార్లు అధికారులకు విన్నవించినా స్పందించడంలేదు. నాసిరకం కూరలు, పురుగుల అన్నంతో కూడిన భోజనం తినలేకపోతున్నామని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నా.. యూనివర్సిటీ యంత్రాంగం సంబంధిత కాంట్రాక్టర్‌పై ఇప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోవడంలేదు.

- నాచుపెల్లి జేఎన్టీయూ మెస్‌లో దుస్థితి
- భోజనం తినలేకపోతున్న విద్యార్థులు
- ఏళ్లుగా ఒకేకాంట్రాక్టర్‌కు బాధ్యతలు కారణం
- ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నా స్పందించని అధికారులు



అన్నంలో పురుగులు(ఫైల్)

ఆరోపణలు ఉన్న సంస్థకే మళ్లీ టెండర్?

- జేఎన్టీయూలో ప్రస్తుతం సరోజన క్యాటరర్స్, హైదరాబాద్ సంస్థ తరఫున విద్యార్థులకు 2018 నుంచి ఆహారం అందిస్తున్నారు.
- ఈ సంస్థ నాణ్యమైన ఆహారం అందించడం లేదని హైదరాబాద్ యూనివర్సిటీలో సుల్తాన్‌పూర్ కళాశాల విద్యార్థులు గతంలోనే ధర్నా చేశారు. అధికారులకు ఫిర్యాదు చేశారు.
- అలాగే, ఇదేవిషయంపై నాచుపెల్లి విద్యార్థులు కూడా అధికారులకు ఫిర్యాదు చేశారు.
- హాస్టల్ మేనేజర్ ప్రిన్సిపాల్ దృష్టికి కూడా ఈ విషయాన్ని తీసుకెళ్లారు.
- అయితే, ఇటీవల యూనివర్సిటీ, హైదరాబాద్‌లో మెస్ టెండర్‌లు నిర్వహించారు.
- సరోజ క్యాటర్స్, హైదరాబాద్, అర్చన పటేల్, మంథని, ఫుడ్‌సుత్ర, హైదరాబాద్, ఫైన్ క్యాటర్స్, హైదరాబాద్ సంస్థలు టెండర్‌లో పాల్గొన్నాయి.
- ఇందులో సరోజ క్యాటర్స్, హైదరాబాద్ సంస్థ మెస్ నిర్వహణ హక్కులు దక్కించుకుంది.

కానరాని తనిఖీలు

- మెస్‌లో నాసిరకం ఆహారం పెడుతున్నారని విద్యార్థులు అనేకసార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా, పత్రికల్లో కథనాలు ప్రచురితమైనా ఫుడ్‌సేఫ్టీ అధికారుల ఇప్పటికీ తనిఖీలు చేయడంలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని విద్యార్థులు కోరుతున్నారు.

నాణ్యత కరువు?

- సరోజ క్యాటర్స్.. ఆహారంలో పురుగులు వచ్చే భోజనం కూడా అందిస్తోంది. టెండర్‌లో పొందుపర్చిన నిబంధనల ప్రకారం నాణ్యతా ప్రమాణాలు పాటించడంలేదు. తాము ఏది పెడితే అదే తినాలనే రీతిలో వ్యవహరిస్తోందని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. ఈ సంస్థను తొలగించి వేరే సంస్థకు బాధ్యతలు అప్పగించాలని విద్యార్థులు నేరుగా యూనివర్సిటీ అధికారులను కలిసి విన్నవించినా ఫలితం లేకపోయింది.

జాడలేని కాంట్రాక్టర్?

- మెస్ కాంట్రాక్టర్ ఏడాదిలో ఒక్కసారైనా కళాశాలలోని మెస్‌కు వచ్చి పర్యవేక్షించిన దాఖలాలు లేవని విద్యార్థులు పేర్కొంటున్నారు.
- తమ సూపర్‌వైజర్‌లతోనే నిర్వహణ కొనసాగిస్తున్నారని అంటున్నారు.
- వీరు ఆహారంలో నాణ్యత తగ్గించుకుంటూ మిగులు సొమ్మును తమ జేబుల్లో నింపుకుంటున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.
- దీనికితోడు అనేకసార్లు సంస్థపై ఆరోపణలు, ఫిర్యాదులు వచ్చినా.. సంబంధిత హాస్టల్ మేనేజర్, ప్రిన్సిపాల్ తగిన చర్యలు తీసుకోవడం మానేసి.. వారు సైతం కాంట్రాక్టర్‌కు వత్తాసు పలుకుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి.
- దీంతో కాంట్రాక్టర్‌కు భయంభక్తి లేకుండా పోయిందని అంటున్నారు.

నాణ్యత పాటించాలి

కళాశాలలో విద్యార్థులకు అందించే ఆహారం నాణ్యంగా ఉండాలని కాంట్రాక్టర్‌కు సూచించాం. ఇందుకోసం తరచూ హాస్టల్‌కు వెళ్లి పరిశీలన చేస్తున్నాం. నిబంధనలు ఉల్లంఘిస్తే కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకుంటాం.

– రమేశ్, ప్రిన్సిపాల్, జేఎన్టీయూ, నాచుపెల్లి

ఒకేసంస్థ నాలుగు చోట్ల టెండర్..

- సరోజ సంస్థపై అనేక ఫిర్యాదులు ఉన్నాయని, దానిని బ్లాక్ లిస్ట్‌లో పెట్టాల్సిన అధికారులు.. అందుకు విరుద్ధంగా రాష్ట్రంలోని నాలుగు జేఎన్టీయూల్లో మెస్‌ల టెండర్లు కట్టబెట్టారనే ఆరోపణలు ఉన్నాయి.
- జగిత్యాల జిల్లా నాచుపెల్లి, సంగారెడ్డి జిల్లా సుల్తాన్‌పూర్‌లో టెండర్ల ద్వారా మెస్ నిర్వహణ హక్కులు దక్కించుకోగా, రాజన్న సిరిసిల్ల, వనపర్తి జిల్లాల టెండర్‌లు లేకుండా బాధ్యతలు అప్పగించారని, దీనివెనుక ఆంతర్యం ఏమిటనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

పోచమ్మ దీవెనలతో సల్లంగా ఉండాలి

- సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్
- గ్రామస్తులతో కలిసి బోనాల పండుగలో పాల్గొన్న మంత్రి



లింగాపూర్ గ్రామస్తులతో కలిసి బోనాల ఊరేగింపులో మంత్రి కొప్పుల ఈశ్వర్, గ్రామస్తులు తదితరులు

పెగడపల్లి(ధర్మపురి): పోచమ్మతల్లి దీవెనలతో గ్రామాలు అన్నిరంగాల్లో అభివృద్ధి సాధించాలని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆకాంక్షించారు. లింగాపూర్ గ్రామంలో ఆదివారం జరిగిన పోచమ్మతల్లి బోనాల ఉత్సవాల్లో మంత్రి పాల్గొని బోనమెత్తారు. అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం మంత్రి మాట్లాడారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అంతకుముందుగా గ్రామంలో రూ.15 లక్షల వ్యయంతో చేపట్టిన కమ్యూనిటీహాల్ భవన నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ రాజేందర్‌రావు, ఎంపీపీ శోభ, ఏఎంసీ చైర్‌పర్సన్ నిర్మల, సర్పంచ్ శంకర్, ఎంపీటీసీ శోభ, బీఆర్‌ఎస్ రాష్ట్ర ప్రత్యేక ఆహ్వానితుడు వోరుగంటి రమణారావు, నంచర్ల సింగిల్‌విండో చైర్‌న్ భాస్కర్‌రెడ్డి, వేణుగోపాల్, నాయకులు పాల్గొన్నారు.

గొల్లపల్లిలో..

గొల్లపల్లి(ధర్మపురి): ఇస్రాజ్‌పల్లి గ్రామంలో ఆదివారం నిర్వహించిన పోచమ్మ బోనాల పండుగలో మంత్రి కొప్పుల ఈశ్వర్ పాల్గొని ప్రత్యేకపూజలు చేశారు. మంత్రికి గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు ఘనస్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జువ్వాడి కుటుంబానికి పరామర్శ

ధర్మపురి: మాజీమంత్రి జువ్వాడి రత్నాకర్‌రావు సతీమణి జువ్వాడి సుమతీదేవి అకాల మరణంపై మంత్రి కొప్పుల ఈశ్వర్ తీవ్రసంతాపం వ్యక్తం చేశారు. ఈమేరకు జువ్వాడి కుటుంబసభ్యులను మంత్రి పరామర్శించారు. తిమ్మాపూర్ గ్రామానికి చెందిన రత్నాకర్‌రావు సతీమణి దశ దినకర్మ ఆదివారం జరిపారు. ఈ కార్యక్రమానికి మంత్రి కొప్పుల ఈశ్వర్ హాజరయ్యారు. సుమతీదేవి చిత్రపటం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి నివాళి అర్పించారు. రత్నాకర్‌రావు కుమారులు జువ్వాడి నర్సింగరావు, నవనీతకృష్ణారావు, చంద్రశేఖర్‌రావుతోపాటు కుటుంబసభ్యులను ఓదార్చారు. ఈ కార్యక్రమంలో డీసీఎమ్మెస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, జెడ్పీటీసీ బత్తిని అరుణ తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీల్లో ఖాళీల భర్తీకి సన్నాహాలు

- నేటినుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ
- ఏడు విద్యాలయాల్లో 17 పోస్టులు ఖాళీ



కథలాపూర్‌లోని కేజీబీవీ

కథలాపూర్(వేములవాడ): ఉచిత వసతి, నాణ్యమైన విద్యా బోధన అందించే కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాలు(కేజీబీవీ) పేద బాలికలకు వరంగా మారాయి. దీంతో ఏటా కేజీబీవీల్లో ప్రవేశాలు పెరుగుతూ వస్తున్నాయి. కానీ, అందులో బోధించేందుకు టీచర్ల కొరత ఉండటంతో ఏటా తాత్కాలిక పద్ధతిన బోధన సిబ్బందిని నియమిస్తూ విద్యాసంవత్సరాన్ని నెట్టుకొస్తున్నారు. ఇకనుంచి టీచర్ల కొరత ఉండొద్దనే లక్ష్యంతో ఉపాధ్యాయ, అధ్యాపక పోస్టుల ఖాళీల భర్తీకి ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది.

7 కేజీబీవీల్లో 17 పోస్టులు ఖాళీ..

- జిల్లాలో 14 కేజీబీవీలు ఉన్నాయి. ఇందులో 7 కేజీబీవీల్లో వివిధ సబ్జెక్టుల్లో 17 పోస్టుల భర్తీకి అధికారులు ఇటీవల నోటిఫికేషన్ జారీచేశారు.
- ఆరో తరగతి నుంచి పదోతరగతి వరకు బోధించేందుకు సీఆర్‌టీలు, ఇంటర్మీడియట్ వరకు బోధించేందుకు పీజీ సీఆర్టీలు, పీఈటీ, స్పెషల్ ఆఫీసర్‌ల భర్తీకి సన్నాహాలు చేస్తున్నారు.

నేటినుంచి దరఖాస్తుల స్వీకరణ..

- జిల్లాలోని కేజీబీవీల్లో బోధన సిబ్బంది ఖాళీ భర్తీ కోసం ఈనెల 26 నుంచి వచ్చేనెల 5వ తేదీ వరకు అధికారులు దరఖాస్తులు స్వీకరిస్తారు. అభ్యర్థులు స్కూల్ ఎడ్యుకేషన్ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ పద్ధతిన దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. సీఆర్టీ పోస్టులకు డిగ్రీ, బీఎడ్ పూర్తిచేసి టెట్‌లో ఉత్తీర్ణత సాధించాలి. పీజీ సీఆర్టీ పోస్టులకు సంబంధిత సబ్జెక్టుల్లో పీజీ, బీఎడ్ పూర్తిచేసి టెట్‌లో ఉత్తీర్ణత సాధించాలి. మహిళా అభ్యర్థులు మాత్రమే ఈ పోస్టులకు అర్హులు. ఎంపికకోసం రాత పరీక్ష ఆన్‌లైన్ విధానంలో నిర్వహిస్తారు. జిల్లాలోని అర్హులైన మహిళా అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా అధికార యంత్రాంగం కోరుతోంది.

విద్యాలయాలవారీగా భర్తీ చేసే పోస్టులు ఇవే..

కేజీబీవీ	పోస్టులు
కథలాపూర్	స్పెషల్ ఆఫీసర్
ఇబ్రహీంపట్నం	స్పెషల్ ఆఫీసర్, పీజీ సీఆర్టీలు–2(ఎకనామిక్స్, నర్సింగ్), సీఆర్‌టీ(బయోసైన్స్)
మేడిపెల్లి	పీఈటీ
పెగడపల్లి	పీఈటీ
కోరుట్ల	పీజీ సీఆర్టీలు–3(బోటనీ, జువాలజీ, కెమిస్ట్రీ
రాయికల్	పీఈటీ, పీజీ సీఆర్టీలు–2(కామర్స్, నర్సింగ్)
వెల్గటూర్	పీఈటీ, పీజీ సీఆర్టీలు–3(కెమిస్ట్రీ, బోటనీ, ఇంగ్లిష్)

రేపు వ్యవసాయాధికారితో 'సాక్షి' ఫోన్‌ఇన్



జగిత్యాలఅగ్రికల్చర్: వర్షాకాలం ఆరంభమైంది. అదను దాటుతున్నా చినుకు జాడలేదు. నేలలో పదను లేదు. విత్తనాలు వేయాలా? వద్దా? అనే సంశయంలో అన్నదాతలు ఉన్నారు. జిల్లాలోని కొన్నిచోట్ల చిరుజల్లులు కురవడంతో విత్తనాలు చల్లిన రైతులు.. వానదేవుని కరుణ కోసం పూజలు చేస్తున్నారు. ఈ సమయంలో రైతులు ఏం చేయాలి? ఎప్పటివరకు విత్తనాలు వేసుకోవాలి? వర్షాలు ఆలస్యమైతే ఏ పంట మంచిది? అదనులో విత్తనాలు వేయకుంటే పంటలు ఏ మేరకు దెబ్బతింటాయనే తదితర విషయాల గురించి ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో వ్యవసాయ పనుల గురించి చర్చించేందుకు సాక్షి దినపత్రిక.. జిల్లా వ్యవసాయాధికారి పి.సురేశ్‌కుమార్‌తో మంగళవారం ఫోన్‌ఇన్ కార్యక్రమం ఏర్పాటు చేసింది. కింద చూపిన ఫోన్ నంబరుకు కాల్‌చేసి రైతులు తమ సందేహాలు నివృత్తి చేసుకోవచ్చు.

'సాక్షి' ఫోన్ ఇన్ కార్యక్రమం : జూన్ 27(మంగళవారం)
సమయం : ఉదయం 10 గంటల నుంచి ఉదయం 11 గంటల వరకు
సంప్రదించాల్సిన ఫోన్ నంబరు : 72888 94119

స్వచ్ఛంద పహారా

- ఏటా వేసవిలో గస్తీ దళాలు
- కొనసాగుతున్న ఆనవాయితీ
- ఊరు కట్టడితో నిరంతరం కాపలా
- ఆదర్శం.. కొండ్రికర్ల గ్రామం

మా ఊరు

కోరుట్ల/మెట్‌పల్లి: ఎవరు చెప్పినా, చెప్పకున్నా ఆ ఊరు ఆనవాయితీని వీడటం లేదు.. ఏటా వేసవి వచ్చిందంటే చాలు స్వచ్ఛంద పహారాకు గస్తీ దళాలతో సిద్ధమవుతోంది.. ఒకరిద్దరు కాదు.. ఏకగా పదహారు మంది ప్రతీరోజు వంతులు వేసుకుని మరీ గ్రామంలో కాపలా కాస్తున్నారు.. కాపలాకు రానివారు జరిమానా చెల్లించక తప్పదు.. ఇంతకీ ఈ ఊరు ఎక్కడుందని అనుకుంటున్నారా..! అదే మెట్‌పల్లి మండలంలోని కొండ్రికర్ల.



కొండ్రికర్లలో కాపలా కాస్తున్న గస్తీ దళాలు

అది ఓ మారుమూల గ్రామం..

- కొండ్రికర్ల మెట్‌పల్లి మండలంలోని ఓ మారుమూల గ్రామం.
- సుమారు 550 నివాసాలు, 1,700కు మించని జనాభా ఉంది.
- ఇరవై ఏళ్ల క్రితం ఈ ఊరికి రవాణా సౌకర్యం సరిగా ఉండేది కాదు.
- దీనికితోడు అప్పట్లో నక్సల్స్ భయం అధికంగా ఉండేది.
- ఏటా వేసవిలో దొంగల భయం ఎక్కువగా ఉండేది.
- దొంగతనాలు జరిగితే పోలీసులు రాత్రివేళ వెంటనే అక్కడికి చేరుకోవడం కష్టతరంగా ఉండేది.
- ఈ పరిస్థితుల్లో గ్రామస్తులు స్వయం పహారా వైపు మొగ్గు చూపారు.
- గ్రామపెద్దలు వేసవిలో దొంగల బెడద అడ్డుకోవడానికి గస్తీ దళాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.
- దీనికి పోలీసుల నుంచి ప్రోత్సాహం అందింది.

చిన్న, పెద్ద తేడా లేదు..

గ్రామంలోని కులసంఘాల వారీగా చిన్న, పెద్ద తేడా లేకుండా ప్రతీ వేసవిలో గ్రామ పహారాకు అంతా సిద్ధంగా ఉండాల్సిందే. కుల సంఘాల వారీగా ప్రతీ సంఘానికి ఇద్దరు చొప్పున గస్తీ తిరగడానికి హాజరవుతారు. దీనికోసం గ్రామస్తులతో కలిసి ఓ వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేసుకున్నారు. ప్రతీరోజు కాపలా కాసేవారి ఫొటోలు చిత్రీకరించి వాట్సాప్ గ్రూపులో షేర్ చేసుకుంటారు. ఒకవేళ గస్తీ కోసం వెళ్లాల్సిన వారు ఆ రోజు వెళ్లలేకపోతే వారికి కొంత జరిమానా విధిస్తారు. రాత్రి పది గంటల నుంచి తెల్లవారుజామున 5 గంటల వరకు ఊరు వాళ్లు కాకుండా కొత్త వాళ్లు ఎవరు వచ్చినా సరే 'ఏం పని మీద వచ్చారు..? ఎవరి ఇంటికి వచ్చారు..?' అని పూర్తి వివరాలు సేకరించిన తర్వాతే అనుతమిస్తారు.

- ఫలితంగా కొండ్రికర్ల గ్రామంలో ఏళ్ల తరబడి వేసవిలో గస్తీ దళాల కాపలా కాస్తున్నారు.
- ఎవరు చెప్పినా, చెప్పకున్నా ఇదే ఆనవాయితీని గ్రామస్తులు ఇప్పటికీ కొనసాగిస్తున్నారు.

గస్తీ కాయడం ఆనవాయితీ



మా ఊరిలో వేసవిలో గస్తీ తిరగడం ఆనవాయితీ. అప్పట్లో దొంగల భయం ఎక్కువగా ఉండేది. అప్పుడు కులసంఘాల వారీగా రోజుకు పదహారు మంది కావలా ఏర్పాటు చేసుకుని దొంగల భయం లేకుండా చూసుకున్నారు. వీరంతా కలిసి రాత్రి నుంచి తెల్లవారుజాము వరకు కాపలా ఉంటరు. వేసవిలో అప్పుడప్పుడు పోలీసులు పెట్రోలింగ్‌కు వచ్చి గస్తీ దళాలను మెచ్చుకుంటరు.

– ఆకుల రాజగంగు, సర్పంచ్

వంతులవారీగా కాపలా



మా గ్రామానికి దొంగల భయం లేకుండా కుల సంఘాల వారీగా వంతులు వేసుకుని ఊరుకు కాపలా ఉంటాం. అన్ని కులసంఘాలు ఇందులో పాలుపంచుకుంటాయి. ఏటా వేసవి ప్రారంభంలో గ్రామస్తులం అందరం కలిసి సమావేశం పెట్టుకుని కాపలాపై చర్చించుకుంటాం. పోలీసులకు సమాచారం అందిస్తాం. వేసవి ముగిశాక కూడా కొద్దిరోజులు కొనసాగిస్తాం.

– శ్రీనివాస్, గ్రామస్తుడు

స్వీయకాపలాతో మేలు



పోలీసు అధికారులపై ఎంతో ఒత్తిడి ఉంటుంది. అనూహ్య సందర్భాల్లో వాళ్లు ఊరికి చేరుకోవాలంటే కష్టమే. అందుకే మేం స్వీయ కాపలాకు సిద్ధమయ్యాం. చాలాఏళ్ల నుంచి ఇదే తీరు కొనసాగుతోంది. మేం కర్రలతో గస్తీ ఉంటున్నామని తెలియక రాత్రివేళ మా ఊరికి వచ్చే వాళ్లు కొన్ని సందర్భాల్లో బెదిరిపోతారు. కానీ మేం వారికి ఎలాంటి హాని చేయం.

– చకినాల నరేశ్, గ్రామస్తుడు

కొండ్రికర్ల ఆదర్శం



కొండ్రికర్ల గ్రామంలో ఏటా వేసవిలో గస్తీ దళాల కాపలా కొనసాగుతోంది. కొన్నిగ్రామాల్లో ఏటా పోలీసు శాఖ తరఫున సమావేశాలు ఏర్పాటు చేసి చెబితేనే గస్తీ దళాలు ఏర్పాటవుతాయి. కానీ కొండ్రికర్లలో గస్తీ దళాలు స్వచ్ఛందంగా ఏర్పాటు చేసుకుని మాకు సమాచారం ఇవ్వడం విశేషం. గ్రామస్తుల తీరు అభినందనీయం.

– శ్యాంరాజ్, ఎస్సై, మెట్‌పల్లి

మౌలిక వసతులు కల్పించండి

- అన్ని పాఠశాలలను అభివృద్ధి చేయండి
- ఏబీవీపీ నాయకుల డిమాండ్
- నేటి బంద్‌కు సహకరించాలని విన్నపం



మాట్లాడుతున్న ఏబీవీపీ నాయకులు

జగిత్యాల: జిల్లాలోని పాఠశాలల్లో కనీస మౌలిక వసతులు కల్పించాలనే డిమాండ్‌తో సోమవారం ఇచ్చిన విద్యా సంస్థల బంద్‌కు జిల్లావాసులు సహకరించాలని ఏబీవీపీ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యుడు రాపాక సాయికుమార్ కోరారు. స్థానిక ఏబీవీపీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని, యూనిఫామ్‌లు, బుక్స్ అందించాలని కోరారు. మన ఊరు.. మన బడి కార్యక్రమం ద్వారా అన్ని ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో మూసివేతకు గురైన 8,624 పాఠశాలలను మళ్లీ తెరిపించాలని ఆయన అన్నారు. విద్యార్థులు, విద్యారంగ సమస్యలు తదితర సమస్యల పరిష్కారం కోసం బంద్‌కు పిలుపునిచ్చినట్లు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు శ్రీను, సునీల్, మనోహర్, మనోజ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు


క్షతగాత్రులను ఆస్పత్రికి తరలిస్తున్న సిబ్బంది

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండలంలోని మండెపల్లి-రాళ్లపేట గ్రామ శివారు మూలమలుపు వద్ద ఆదివారం ఆటో, ద్విచక్రవాహనం ఢీకొన్న ఘటనలో పలువురికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఓబులాపూర్ గ్రామానికి చెందిన శ్రీనివాస్ తన ద్విచక్ర వాహనంపై మండెపల్లి వైపు వెళ్తున్నాడు. అదే సమయంలో చంద్రంపేటకు చెందిన రాజు, స్వరూప ప్యాసింజర్ ఆటోలో ఓబులాపూర్‌కు వెళ్తుండగా మూలమలుపు వద్ద రెండు వాహనాలు ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఆటో డ్రైవర్ రాజు (45), ప్రయాణికురాలు స్వరూప (25)కు తీవ్ర గాయాలుకాగా శ్రీనివాస్‌కు స్వల్ప గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం 108 సిరిసిల్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

గీత కార్మికుడికి గాయాలు


అంజయ్య గౌడ్

తంగళ్లపల్లి (సిరిసిల్ల): మండలంలోని జిల్లెల్ల గ్రామానికి చెందిన కందుకూరు అంజయ్య గౌడ్ తాటిచెట్టు పై నుంచి పడగా తీవ్ర గాయాలయ్యాయి. అంజయ్య రోజూ మాదిరిగానే ఆదివారం సాయంత్రం కల్లు గీసేందుకు తాటిచెట్టు ఎక్కాడు. మోకుజారి చెట్టు పైనుంచి కిందపడటంతో తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు చికిత్స నిమిత్తం అంజయ్యను సిరిసిల్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

దేశ చరిత్రలో చీకటి రోజు ఎమర్జెన్సీ


మాట్లాడుతున్న గోపి

సిరిసిల్లటౌన్: దేశ చరిత్రలో 1975వ సంవత్సరంలో దివంగత మాజీ ప్రధాని ఇందిరాగాంధీ ఎమర్జెన్సీ ప్రకటించడం చీకటి రోజు అని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డబోయిన గోపి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కుటుంబ పాలన, అధికారాన్ని అడ్డుపెట్టుకోవడానికి ఇందిరాగాంధీ ఎమర్జెన్సీ ప్రకటించిందన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకుడు ఆడెపు రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

దాతలసాయంతో అంత్యక్రియలు పూర్తి

తంగళ్లపల్లి (సిరిసిల్ల): మండలంలోని బస్వాపూర్‌కు చెందిన గొడిసెల దేవయ్య (45) శనివారం సాయంత్రం గ్రామశివారులోని కల్వర్టు వద్ద కారు ఢీకొనడంతో మృతిచెందాడు. మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని గ్రామస్తులు పట్టుబట్టడంతో పోస్టుమార్టం కూడా ఆలస్యంగా నిర్వహించారు. మద్యం మత్తులో కారు నడిపిన వ్యక్తికి చెందినవారు మృతుడి కుటుంబాన్ని ఆదుకుంటామని హామీ ఇవ్వడంతో గ్రామస్తులు శాంతించారు. నిరుపేద కుటుంబం కావడంతో గ్రామస్తులు చందాలు పోగుచేశారు. జెడ్పీటీసీ పూర్మాణి మంజుల రాంలింగారెడ్డి దంపతులు రూ.5,016 తోపాటు దాతల సాయంతో అంత్యక్రియలు నిర్వహించారు. కాగా ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్‌పై ఇప్పటికే తంగళ్లపల్లి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది.

నారుమడికి సమయమిదే

- విత్తన రకాలను బట్టి నారు పోసుకోవాలి
- మధ్య, స్వల్పకాలిక రకాలకు అవకాశం
- వరినారు పెంపకంపై జాగ్రత్తలు సూచిస్తున్న
- పొలాస వ్యవసాయ శాస్త్రవేత్తలు


పరిశోధనా స్థానంలో పెంచుతున్న వరి నారు

జగిత్యాల అగ్రికల్చర్ : జిల్లాలో వరి ప్రధాన పంట. వర్షాధారం, నీటి వసతి ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో వరి సాగు చేసేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. వరిసాగులో ప్రధానంగా భావించే నారుమడులను పెంచేందుకు రైతులు నిమగ్నమవుతున్నారు. పంటకోతకు వచ్చే రోజులను బట్టి వరి రకాలను దీర్ఘకాలిక, మధ్యకాలిక, స్వల్పకాలికంగా విభజించారు. వరి నారు పెంపకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పొలాస వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు రైతులకు సూచిస్తున్నారు.

అనువైన రకాలు ఎంచుకోవాలి

వానాకాలం సీజన్‌కు అనువైన వరిరకాలను ఎంచుకోవాలి. దిగుబడినిచ్చే రకాలకు ప్రాధాన్యం ఇవ్వాలి. వాతావరణ పరిస్థితులు, నేల స్వభావం, చీడపీడల ఉధృతి, సాగునీటి వనరులను దృష్టిలో ఉంచుకొని విత్తనాన్ని ఎంచుకోవాలి. వ్యవసాయ శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు సిఫార్సు చేసిన విత్తన రకాలకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలి.

విత్తన మోతాదు

వరి నాటుకు .. సన్నగింజ రకాలైతే ఎకరాకు 10–15 కిలోలు, దొడ్డు రకాలైతే 20–25 కిలోల విత్తనం అవసరం ఉంటుంది. వెదజల్లే పద్ధతిలో ఎకరాకు 10 కిలోలు, డ్రమ్ సీడర్‌తో వేయడానికి 10–15 కిలోలు, శ్రీవరి సాగు పద్ధతిలో రెండు కిలోల విత్తనం అవసరం ఉంటుంది.

విత్తే సమయం..

దీర్ఘకాలిక రకాలు (145–150 రోజులు) జూన్ చివరి వరకు, మధ్యకాలిక రకాలను (135–140 రోజులు) జూన్, జూలై నెలల్లో వేసుకోవచ్చు. స్వల్పకాలిక రకాలను (120–125 రోజులు) జూలై నుంచి ఆగస్టు మూడో వారం వరకు నారు పోసుకోవచ్చు.

విత్తన శుద్ధి

నారుమడిలో తెగుళ్లు సోకకుండా ఉండేందుకు ముందుగా విత్తన శుద్ధి తప్పనిసరిగ్గా చేసుకోవాలి. లేదంటే, విత్తనాల ద్వారా పొడ తెగులు, ఆకుమచ్చ తెగులు, అగ్గి తెగులు, ఆకు ఎండు తెగులు వ్యాపించే అవకాశం ఉంది. కిలో విత్తనానికి గ్రాము కార్బండిజమ్ కలిపిన లీటర్ మందు నీటిలో ఒకరోజు నానబెట్టాలి. లేదా పొడి విత్తన శుద్ధి చేయాలనుకున్న రైతులు కార్బండిజమ్, థైరామ్, కాప్టాన్ రసాయనాల్లో ఏదో ఒక దానిని కిలో విత్తనానికి రెండున్నర గ్రాముల చొప్పున కలిపి శుద్ధి చేయాలి.

నారుమడి తయారీ..

తొలకరి వర్షాలు కురవగానే నారుపోసే మడులను రెండు, మూడుసార్లు బాగా దున్ని, కలుపు లేకుండా బురద దుక్కి చేయాలి. నీరు పెట్టడానికి, మురుగు నీరు వెళ్లేలా కాలువలు ఏర్పాటు చేసుకోవాలి. నారుమడిలో బాగా మాగిన పశువుల ఎరువు లేదా కోళ్ల ఎరువును వేసి కలియదున్నాలి. ఎకరం పొలానికి 4–5 సెంట్ల నారుమడి అవసరం. ఒక సెంటు నారుమడికి 5 కిలోల విత్తనం వేయాలి. ఆఖరు దమ్ములో 5 సెంట్ల నారుమడికి 2.2 కిలోల యూరియా, 6.25 కిలోల సింగిల్ సూపర్ పాస్పేట్, 1.7 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ వేసుకోవాలి. విత్తిన 10–15 రోజుల తర్వాత 2.2 కిలోల యూరియాను నారుమడిలో చల్లుకోవాలి.

జాగ్రత్తలు తీసుకోవాలి

నారుమడిలో విత్తనం చల్లేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలి. విత్తనాన్ని 24 గంటలు నీటిలో నానబెట్టి, 36 గంటలు మండి కట్టినట్లయితే మొలక త్వరగా వస్తుంది. మొలకెత్తిన విత్తనాన్ని సెంటుకు 4–5 కిలోల చొప్పున, 5 సెంట్లకు 20–25 కిలోల విత్తనాన్ని చల్లుకోవాలి. మొలకెత్తిన విత్తనాన్ని ఒక సెం.మీ లోతు నీరుంచి మడుల్లో చల్లుకోవాలి. తర్వాత నీరు తీసివేసి వారందాకా నీటి తడులు ఇవ్వాలి. నాట్లువేసే వరకు రోజూ నీరు పెడుతూ ఉండాలి.

కలుపు యాజమాన్యం

విత్తిన 3–5 రోజులకు నారుమడికి 7.5 మి.లీ బ్యూటాక్లోర్ అనే మందును లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయడంతో కలుపు మొక్కలను నివారించవచ్చు. లేదా విత్తనం చల్లిన 14, 15 రోజులకు 10 శాతం సైహలోఫాప్ బ్యుటైల్ 2 మి.లీ మందును లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

నాణ్యమైన విత్తనం ఎంపిక చేసుకోవాలి



పంట ఎప్పుడు కోతకు రావాలో రైతులు ముందుగా నిర్ణయించుకొని ఆ మేరకు నార్లు పోసుకోవాలి. నారు పోసిన సమయంలో రైతులు తగిన జాగ్రత్తలు తీసుకుంటే సమస్యలు తలెత్తవు. నాణ్యమైన విత్తనాన్ని ఎంపిక చేసుకోవాలి. బురద దుక్కి చేసి నారు పోసుకోవాలి.
– శ్రీనివాస్, వరి శాస్త్రవేత్త, పొలాస

సెల్‌టవర్ బ్యాటరీలు చోరీ

ఇబ్రహీంపట్నం : మండలంలోని గోధూర్ గ్రామంలో ఎయిర్‌టెల్ సెల్‌టవర్ వద్ద శనివారం రాత్రి బ్యాటరీలను దొంగలు ఎత్తుకెళ్లినట్లు ఎస్సై ఉమాసాగర్ ఆదివారం తెలిపారు. టవర్ వద్ద 24 బ్యాటరీలను దొంగలు ఎత్తుకెళ్లారన్నారు. ఘటనా స్థలాన్ని ఎస్సై పరిశీలించారు. కంపెనీ సూపర్‌వైజర్ హుస్సేన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

మహిళ మెడలోంచి పుస్తెలు చోరీ


బాధితురాలు లక్ష్మి

జగిత్యాల క్రైం : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తిరుమణి లక్ష్మి అనే మహిళ మెడలోంచి గుర్తు తెలియని వ్యక్తి పుస్తెలతాడును ఎత్తుకెళ్లాడు. ఇబ్రహీంపట్నం మండలం బర్దీపూర్ గ్రామానికి చెందిన లక్ష్మి అనారోగ్యంతో బాధపడుతూ జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రిలో చేరింది. ఆదివారం సాయంత్రం గుర్తు తెలియని వ్యక్తి ఆమె వద్దకు వచ్చి మెడలోని నల్లపూసల గొలుసుకున్న పుస్తెలను ఎత్తుకెళ్లాడు. బాధితురాలు పోలీసులకు సమాచారం అందించగా పోలీసులు సీసీ ఫుటేజీలను పరిశీలిస్తున్నారు.

దుకాణంలో చోరీ


వివరాలు తెలుసుకుంటున్న పోలీసులు

జగిత్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని కరీంనగర్ రోడ్డులో ఉన్న ఓ దుకాణంలో శనివారం అర్ధరాత్రి నగదుతోపాటు సీసీ కెమెరాల సామగ్రిని దొంగలు ఎత్తుకెళ్లారు. వివరాల్లోకి వెళ్తే.. పట్టణంలోని కరీంనగర్ రోడ్డులో ఐటీసీ బ్రాండ్ హోల్‌సెల్ దుకాణాన్ని ఊటూరు మహేశ్ నిర్వహిస్తున్నారు. శనివారం రాత్రి కౌంటర్లలో సుమారు రూ.80 వేలు నగదు, రూ.50వేలు విలువైన బంగారు కాయిన్స్, రూ.4వేల విలువైన వెండి కాయిన్స్ ఉంచి, తాళాలు వేసి వెళ్లారు. తెల్లారేసరికి షెట్టర్ పగులగొట్టి ఉండటంతో పాటు నగదు కనిపించకపోవడంతో పోలీసులు సమాచారం అందించారు. పట్టణ సీఐ నటేశ్, ఎస్సై రమేశ్, అబ్దుల్ రహీం ఘటనా స్థలానికి చేరుకొని దొంగతనం జరిగిన తీరును పరిశీలించారు. సీసీ కెమెరాలు పరిశీలించగా మారుతి వ్యాన్‌లో ముగ్గురు వ్యక్తులు వచ్చి దొంగతనం చేసినట్లు గుర్తించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ నటేశ్ తెలిపారు.

ప్రమాదవశాత్తు జారిపడి యువకుడి మృతి

చందుర్తి(వేములవాడ) : ప్రమాదవశాత్తు జారిపడి ఓ యువకుడు మృతిచెందిన సంఘటన మండలంలోని ఆశిరెడ్డిపల్లెలో చోటు చేసుకుంది. స్థానికులు, ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన దోకూరి పున్నమ రెడ్డి అనే రైతు వద్ద బిహార్‌కు చెందిన సుజిత్‌కుమార్ (19) కూలీగా చేరాడు. పశువుల పాక (డైయిరీ ఫామ్)లో ఆదివారం ఉదయం ఆవు పాలు పితికి బయటకు వచ్చే క్రమంలో సుజిత్ కుమార్ పేడపై కాలుజారి ప్రమాదవశాత్తు పక్కనే ఉన్న సిమెంటు స్తంభంపై పడ్డాడు. దీంతో తలకు తీవ్రగాయాలుకాగా అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. అక్కడే పనిచేస్తున్న కూలీలు వచ్చి చూడగా సుజిత్‌కుమార్ మృతిచెందాడు. యువకుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సిరిసిల్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం వారి బంధువులకు మృతదేహాన్ని అప్పగించినున్నట్లు ఎస్సై జిల్లెల్ల రమేశ్ పేర్కొన్నారు.

ఇష్టారాజ్యంగా మట్టి తరలింపు


శాత్రాజుపల్లిలో చెరువు నుంచి మట్టి తీస్తున్న జేసీబీ

వేములవాడరూరల్: వేములవాడ మండలంలో ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా మట్టిని తరలిస్తున్నట్లు పలువురు ఆరోపిస్తున్నారు. మున్సిపాలిటీ పరిధిలోని పలు గ్రామాలతో పాటు, రూరల్ మండలంలోని పలుప్రాంతాల నుంచి కొందరు వ్యాపారులు మట్టిని తరలిస్తున్నట్లు తెలుపుతున్నారు. దీనిపై అధికారులు చర్యలు తీసుకోవడానికి వెనుకడుగు వేస్తున్నట్లు తెలిసింది. ప్రభుత్వ స్థలంలో మట్టిని తరలించవద్దని నిబంధన ఉన్నా కొందరు ప్రజాప్రతినిధులు ఇష్టారాజ్యంగా మట్టిని తరలిస్తున్నట్లు ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రధానంగా శాత్రాజుపల్లి, నాగాయపల్లి, మర్రిపల్లి, ఫాజుల్‌నగర్, పలు గ్రామాల్లోని చెరువుల నుంచి మట్టిని తరలిస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రెవెన్యూ శాఖ అధికారులు, సంబంధిత శాఖ అధికారులకు తెలిసినా పట్టించుకోకపోవడం పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

పేదల సంక్షేమం కాంగ్రెస్‌తోనే సాధ్యం

ఇల్లంతకుంట (మానకొండూర్): పేదలు, బడుగు, బలహీన వర్గాల ప్రజాసంక్షేమం కాంగ్రెస్‌తోనే సాధ్యమని కరీంనగర్ డీసీసీ అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని వైశ్యాభవన్‌లో కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. వివిధ పార్టీలకు చెందిన పలువురు కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరగా కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తొమ్మిదేళ్ల కేసీఆర్ సర్కారు పాలనలో అవినీతి పెరిగిందన్నారు. డబుల్ బెడ్‌రూం ఇళ్లు, దళితులకు మూడెకరాల భూమి, దళితబంధు పథకాలు మూలనపడ్డాయని, ఇప్పుడు బీసీ బంధు పేరుతో సీఎం కేసీఆర్ మరో కొత్త నాటకానికి తెరలేపారన్నారు. రైతు రుణమాఫీ చేస్తామని చెప్పి నాలుగున్నరేళ్లు గడుస్తున్నా ఇప్పటి వరకు రుణమాఫీ చేయలేదని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో సీఎం కేసీఆర్‌కు ప్రజలు తగిన గుణపాఠం చెబుతారన్నారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు అంతగిరి వినయ్‌కుమార్, పసుల వెంకటి, ఎస్ఎల్ గౌడ్, బాలపోచయ్య, ఒగ్గు రమేశ్, జమాల్, లింగం, మల్లయ్య, ప్రసాద్, రాజేశం, మల్లారెడ్డి, నరేశ్, తదితరులున్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం


నిజామాబాద్‌లో సమావేశమైన పూర్వ విద్యార్థులు

కోనరావుపేట: మండలంలోని నిజామాబాద్ ఉన్నత పాఠశాలలో చదివిన 2008–09 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని నిర్వహించారు. ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకొని యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నా రు. పాఠశాలలో చదివిన రోజులను నెమరవేసుకొని ఆనందంగా గడిపారు. ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న సహ విద్యార్థులకు ఆర్థిక సాయం అందజేశారు.

'నెలరోజుల్లో 21 సెల్‌ఫోన్లు అప్పగించాం'

వేములవాడ: రాజన్నను దర్శించుకునేందుకు వచ్చే భక్తులతో పాటు స్థానికులు తమ సెల్‌ఫోన్లను పోగొట్టుకుంటే సీఈఐఆర్ ద్వారా గుర్తించి పోలీసుశాఖ వారికి అప్పగిస్తుందని సీఐ వెంకటేశ్ తెలిపారు. హైదరాబాద్‌లోని చింతల్‌బస్తీకి చెందిన భాస్కర్‌రావు ఆదివారం తన మొబైల్‌ను పోగొట్టుకున్నట్లు తమకు దరఖాస్తు చేసుకోవడంతో సీఈఐఆర్ ద్వారా గుర్తించి సెల్‌ఫోన్‌ను అప్పగించినట్లు చెప్పారు. వేములవాడ పోలీస్‌స్టేషన్ పరిధిలో నెలరోజుల్లో 21 సెల్‌ఫోన్లు అప్పగించినట్లు తెలిపారు.

అంబులెన్స్ నిర్వాహకుల దందా

- ఎక్కడ ప్రమాదం జరిగినా ప్రైవేటు ఆస్పత్రులకే
- వద్దని చెప్పినా వైద్యం
- నష్టపోతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు



జగిత్యాల: మల్యాల మండలం పోతారం గ్రామానికి చెందిన జున్ను శ్రీధర్, కొలగాని రాజిరెడ్డి ద్విచక్రవాహనంపై శుక్రవారం జగిత్యాలకు వెళ్తుండగా రాజారం వద్ద ఆర్టీసీ బస్సు ఢీకొని తీవ్రంగా గాయపడ్డారు. 108కు సమాచారం అందించగా అక్కడికి ప్రైవేట్ అంబులెన్స్ వచ్చి క్షతగాత్రులను జిల్లా కేంద్రంలోని అశోక్‌నగర్‌లో గొల్లపల్లి రోడ్డులో ఇటీవల ఏర్పాటు చేసిన ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. తమను ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లండి... డబ్బులు లేవని మొత్తుకున్నా అదే ఆస్పత్రిలో చేర్పించారు. అనంతరం వైద్యులు కూడా చికిత్స చేసి రూ.25 వేల బిల్లు వేశారు. మేం వద్దని చెప్పినా ఇక్కడ చికిత్స చేశారని, డబ్బులు లేవని చెప్పినా కట్టాల్సిందేనని ఒత్తిడి తెచ్చారని శ్రీధర్ తెలిపారు. అప్పు తీసుకొచ్చి చివరికి డబ్బులు చెల్లించామని, ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స చేయించుకుంటామని చెప్పినా ప్రైవేట్‌లో చేర్పించి మమ్మల్ని ఇబ్బందులకు గురిచేశారని ఆయన వాపోయారు.

జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ ఆస్పత్రులు అంబులెన్స్‌ల నిర్వాహకులతో కుమ్మక్కై ఎక్కడైనా ప్రమాదం జరిగితే వారిని ఆస్పత్రులకే తీసుకెళ్లేలా చూస్తున్నారు. దీంతో ఆ పేషెంట్‌కు ఎంఆర్ఐ, సిటీస్కాన్ చేస్తూ అందినకాడికి దోచుకుంటున్నారు. జగిత్యాలలో ఇలాంటి ఘటనలు రోజు జరుగుతున్నాయి. ఏదైనా సంఘటన జరిగినప్పుడు 108కు ఫోన్ చేస్తారు. అంబులెన్స్ వస్తే వారు నేరుగా ప్రభుత్వ ఆస్పత్రికే తీసుకెళ్తారు. ఒకవేళ పేషెంట్ పరిస్థితి విషమంగా ఉండి ప్రభుత్వ ఆస్పత్రిలో వసతులు లేని సందర్భంలో వైద్యుల సూచన మేరకు ప్రైవేటు ఆస్పత్రులకు తీసుకెళ్తారు. కానీ ఇక్కడ 108కు ఫోన్ చేస్తే నేరుగా ప్రైవేట్ అంబులెన్స్‌లు వస్తున్నాయి. గొల్లపల్లి రోడ్డులో ఇటీవల ఏర్పాటు చేసిన ఆస్పత్రిలో ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయి.

నిర్వాహకులతో కుమ్మక్కు

జిల్లాలో కృష్ణానగర్, అశోక్‌నగర్, సంతోష్‌నగర్ ప్రధాన ప్రాంతాల్లో ఆస్పత్రులు వెలిశాయి. చిన్న చిన్న భవనాలను అద్దెకు తీసుకొని ఎక్కడి నుంచో వైద్యులను తీసుకువచ్చి వైద్యం చేస్తున్నారు. అంబులెన్స్ నిర్వాహకులతో కుమ్మక్కై ప్రమాదం జరిగిన చోటుకు వెళ్లి ప్రైవేట్ ఆస్పత్రులకే తీసుకుచ్చేలా చూస్తున్నారు. పేషెంట్లు తమ వద్ద డబ్బులు లేవని మొత్తుకున్నా బలవంతంగా చికిత్స చేసి డ బ్బులు వసూలు చేస్తున్నారు. నిత్యం కోకొల్లాలుగా జరుగుతున్నా వైద్యాధికారులు పట్టించుకోవడం లేదు.


అంబులెన్స్

నిబంధనలు ఎక్కడ?

ఆస్పత్రి ఏర్పాటు చేయాలంటే నిబంధనలు ఉంటాయి. కానీ కొందరు వైద్యమే వ్యాపారంగా మారుస్తూ అందినంత దోచుకుంటున్నారు. ఒక ఆస్పత్రి ఏర్పాటు చేయాలంటే నిబంధనల ప్రకారం విశాలమైన భవనం, ఫైర్ సేఫ్టీ, మౌలిక వసతులుండాలి. ఏ డాక్టర్ అయితే ఆ హాస్పిటల్‌లో ఉంటున్నాడో అతనిపైనే రిజిస్ట్రేషన్ అయి ఉండాలి. కొందరు మల్టీ స్పెషాలిటీ, ట్రామా అని, కార్డియాక్ అని ఇలా ఎన్నో పేర్లతో ఏర్పాటు చేస్తున్నారు. కానీ అందులో డాక్టర్లు మాత్రం ఎవరున్నారో తెలియని పరిస్థితి నెలకొంది. ఒకనెలకు ఓ డాక్టర్ ఉంటే మరో నెలకు మరో డాక్టర్ వస్తున్నారు. వైద్యశాఖ తనిఖీలు చేపట్టకపోవడంతో ఇష్టానుసారంగా మారింది. ఇప్పటికైనా వైద్యాధికారులు స్పందించి పేద ప్రజలు దోపిడీకి గురికాకుండా ఈ ఆస్పత్రులపై నిఘా పెంచాలని ప్రజలు కోరుతున్నారు. ముఖ్యంగా అంబులెన్స్ నిర్వాహకుల దందాకు చెక్ పెట్టాలని కోరుతున్నారు.

అసత్య ప్రచారం చేసిన వారిపై చర్య తీసుకోవాలి

సిరిసిల్లక్రైం: పోలీసులపై అసత్య ప్రచారం చేసినవారి వివరాలపై దర్యాప్తు చేసి తగు చర్యలు తీసుకోవాలని సిరిసిల్ల పట్టణానికి చెందిన ఎడ్ల అరవింద్ కోరాడు. ఆదివారం సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ, తన మొబైల్ నంబర్‌ను ఉపయోగించి సామాజిక మాధ్యమాల్లో ఓ సీఐ స్థాయి అధికారి తనను తిట్టినట్లు ప్రచారం జరుగుతుందని, కానీ దానిలో వాస్తవం లేదని వాపోయాడు. ఇందులో తనకు సంబంధం లేదని స్పష్టం చేశాడు.

అసత్య ప్రచారం చేసిన వ్యక్తిపై కేసు

తంగళ్లపల్లి మండలం బస్వాపూర్‌లో కారు ప్రమాదంలో వ్యక్తి మరణించగా సంబంధిత విషయమై కేసు నమోదు చేసినప్పటికీ పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని, పోలీసులపై సామాజిక మాధ్యమాల్లో అసత్య ప్రచారం చేసిన వ్యక్తిపై కేసు నమో దు చేసినట్లు సీఐ అనిల్ కుమార్ తెలిపారు. బాధితుల పట్ల పోలీసులు నిర్లక్ష్యంగా వ్యహరించారని సామాజిక మాధ్యమాల్లో అసత్య ప్రచారం చేసిన చిగురు ప్రశాంత్‌పై ఆదివారం కేసు నమోదు అయింది. నిజాలు తెలియకుండా పోలీసుల విధి నిర్వహణపై అనుమానాలకు తావిచ్చేలా, ప్రజలకు నమ్మకం సడలేలా చేసేవారిపై కఠిన చర్యలకు వెళ్తామని సీఐ హెచ్చరించారు.

ప్రైవేట్ స్కూల్ పుస్తకాల గది సీజ్

గోదావరిఖనిటౌన్: స్థానికంగా ఓ ప్రైవేట్ పాఠశాల నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాలు అమ్ముతుండడంతో విద్యాశాఖ అధికారులు పుస్తకాల గదిని సీజ్ చేసినట్లు ఏబీవీపీ నగరకార్యదర్శి సిద్ధార్థ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎలాంటి అనుమతులు లేకుండా పాఠ్యపుస్తకాలు, యూనిఫార్మ్, స్టేషనరీలు అధిక ధరలకు అమ్ముతున్నారని సమాచారం అందించడంతో బుక్ స్టాల్‌ని విద్యాశాఖ అధికారులు సీజ్‌చేశారన్నారు. ప్రైవేటు పాఠశాలలు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాలు, స్టేషనరీల పేరుతో వేలాది రూపాయలు దోచుకుంటు విద్యార్థుల తల్లిదండ్రులను తీవ్ర ఆర్థిక దోపిడీకి గురిచేస్తున్నాయన్నారు. అనుమతులు లేకుండా పాఠశాలలు, పుస్తకాలు అమ్ముతున్న వారిపై కఠిన చర్యలు తీసుకొని గుర్తింపు రద్దుచేయాలని డిమాండ్ చేశారు.

చెరువులో చెట్లు అమ్ముకున్నారు

- చేతులు మారిన రూ.10 లక్షలు.?
- ప్రజాప్రతినిధి భర్తే పాత్రదారి


తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండలంలోని అంకుషాపూర్‌లో ఓ ప్రజాప్రతినిధి భర్త అక్రమార్జనకు పాల్పడిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గ్రామంలోని చెరువు సమీపంలో వందలసంఖ్యలో ఉన్న చెట్లను అప్పనంగా అమ్ముకొని సొమ్ము చేసుకున్నాడని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గ్రామంలో కొంతమందితో చేతులు కలిపిన సదరు ప్రజాప్రతినిధి భర్త చెట్లను విక్రయించి ఏకంగా రూ.10 లక్షలు వెనకేసుకున్నట్లు తెలుస్తోంది. ఈ విషయం బయటకి పొక్కినా అధికారులు మాత్రం చర్యలు తీసుకునేందుకు వెనకడుగు వేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికార పార్టీ నాయకుడు కావడం వల్లే గ్రామంలో పెత్తనం చెలాయిస్తున్నాడని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. డబుల్ బెడ్‌రూం లబ్ధిదారుల వద్ద ఒకొక్కరి నుంచి రూ.15 వేలు వరకు వసూలు చేశాడని గ్రామంలో చర్చ జరుగుతోంది. జిల్లా ఉన్నతాధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారోనని తెలుపుతున్నారు.

తాటిచెట్టుపై నుంచి పడి గీతకార్మికుడి మృతి


రాజమౌళి(ఫైల్)

ఎలిగేడు: మండలంలోని లోకపేట గ్రామానికి చెందిన వెలిచాల రాజమౌళి(55) గీత కార్మికుడు తాటిచెట్టుపై నుంచి కిందపడి మృతిచెందిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. గ్రామస్తులు, తోటి గీత కార్మికులు తెలిపిన వివరాల ప్రకారం.. మృతుడు గీత కార్మికుడు రాజమౌళి రోజువారిగా కల్లు గీసేందుకు తాటిచెట్టు ఎక్కి కల్లుగీస్తుండగా మోకు జారడంతో చెట్టుపై నుంచి కిందపడి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య సుశీల, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నా రు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు జూలపల్లి పోలీసులు తెలిపారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సర్పంచ్ ప్రభావతి, గీత కార్మికులు, గ్రామస్తులు కోరారు.

అనారోగ్యంతో మరొకరు..


కట్ట రమేశ్(ఫైల్)

కరీంనగర్‌రూరల్: అనారోగ్యంతో మృతిచెందిన ఓ వ్యక్తి అంత్యక్రియలు నిర్వహించలేని దీనస్థితిలో కుటుంబసభ్యులుండగా యువకులు స్పందించి విరాళాలు సేకరించారు. నగదును కుటుంబ సభ్యులకు అందించి మానవత్వం చాటుకున్నారు. మిగిలిన గ్రామాల ఆదర్శంగా నిలిచారు. కరీంనగర్ మండలం దుర్శేడ్‌కు చెందిన స్వర్ణకారుడు కట్ట రమేశ్(58) వృత్తి పనులు సక్రమంగా సాగక మెట్‌పల్లిలోని కోళ్లఫారంలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. ఆరునెలలుగా అనారోగ్యంతో ఇంటివద్దే ఉంటున్నాడు. ఈక్రమంలో ఆదివారం ఆకస్మికంగా మృతిచెందాడు. భార్య నిర్మల గృహిణికాగా కుమారుడు సూరజ్, కుమార్తె సుచితలున్నారు. అంత్యక్రియలు నిర్వహించలేని కడు పేదరికంలో కుటుంబం ఉండగా గ్రామంలోని యువత స్పందించి వాట్సప్ గ్రూప్‌లో పోస్టుచేయడంతో స్పందించిన యువత విరాళాలు ప్రకటించారు. ఉపసర్పంచ్ సంపత్‌రావు ఆధ్వర్యంలో యువకులు రూ. 10వేల ఆర్థికసాయాన్ని మృతుడి కుటుంబానికి అందించగా అంత్యక్రియలు నిర్వహించారు. నిరుపేద అంత్యక్రియలకు విరాళాలను అందించి మానవత్వం ప్రదర్శించిన యువకులను స్థానిక ప్రజాప్రతినిధులు అభినందించారు.

జాతీయస్థాయి ఉషు పోటీలకు జిల్లా క్రీడాకారులు

కరీంనగర్‌స్పోర్ట్స్: మహరాష్ట్ర పూణెలోని శివ్ ఛత్రపతి శివాజీ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఈనెల 26 నుంచి జూలై 1 వరకు నిర్వహించే జాతీయస్థాయి సీనియర్స్ వుషు పోటీలకు జిల్లాకు చెందిన కె.సాయికృష్ణ, శ్రీనివాస్, శ్రీధర్, శ్రీనివాస్ ఎంపికైనట్లు ఉషు సంఘం కార్యదర్శి విద్యాసాగర్ తెలిపారు. ఇటీవల నిజామాబాద్ జిల్లాలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికైన క్రీడాకారులను సంఘం అధ్యక్షుడు డాక్టర్ ఎడవెల్లి విజయేందర్‌రెడ్డి, జిల్లా ఒలింపిక్ సంఘం ప్రధానకార్యదర్శి గసిరెడ్డి జనార్దన్‌రెడ్డి, కోచ్‌లు కోడూరి శేఖర్, ఎలంగదుల శ్రీనివాస్, రాజావిక్రం, గాంధీ అభినందించారు.